క్లుప్తంగా

ఏసీడీని ఉపసంహరించుకోవాలి

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం విధించిన వినియోగాధారిత డిపాజిట్ (ఏసీడీ)ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఏటా ఏసీడీ పేర డబ్బులు వసూలు చేయడంపై ఆక్షేపించారు. కేసీఆర్ సర్కార్ ఓ నికృష్ట పాలన కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ వరంగల్ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్యాంసుందర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గరిగె మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: ఓ నిరుపేద మహిళ అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి ముందుకు వచ్చారు. ఈమేరకు దహన సంస్కారాల నిమిత్తం రూ.3వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్లకు చెందిన గుడికందుల సరోజన అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. అంత్యక్రియలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని వెంకటేశ్వర్‌రెడ్డి చేయూతనందించారు. కార్యక్రమంలో స్థానికులు వీరస్వామి, శ్రీధర్, శ్రవణ్, సతీష్‌చారి, మట్టెడ అనిల్, రాజేందర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

జీబ్రాలైన్ల ఏర్పాటు



కాజీపేట: కాజీపేట చౌరస్తాలో వాహనాల నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులు పలు సంస్కరణలను అమలు చేస్తున్నారు. సీపీ డాక్టర్ రంగనాథ్ ఆదేశాల మేరకు చౌరస్తాలో నలువైపులా ప్రమాదాల నివారణకు జీబ్రాలైన్ల ఏర్పాటుకు మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా బుధవారం శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరిస్తూ రహదారులు దాటేలా జీబ్రాలైన్లు వేస్తున్నారు. మున్సిపల్ డీఈ సతీష్‌కుమార్, ఏఈ పాక వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రావుల రణధీర్‌రెడ్డి, హమీద్ పాల్గొన్నారు.

వీరలక్ష్మి కాలనీపై నిఘా పెంచాలి

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని ఆకారపు వీరలక్ష్మి కాలనీలో కొంత మంది ఆకతాయిలు తిష్టవేసి పనిగట్టుకొని స్థానిక మహిళలను భయభ్రాంతులు గురిచేస్తున్నారని స్థానికులు వాపోయారు. పగలు, రాత్రి మద్యం మత్తులో తూగుతూ మహిళలపై దుర్భాషలాడుతూ రెచ్చిపోయి వీరంగం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో కాలనీవాసులకు రక్షణ కరువైందని వాపోయారు. ఈమేరకు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను కాలనీ మహిళా ప్రతినిధులు బండారి శోభ, స్వప్న, మాధవి కలిసి బుధవారం ఫిర్యాదు చేశారు. కాలనీ ప్రజలు, మహిళలకు రక్షణ కల్పించాలని, పగలు, రాత్రి పోలీసు నిఘా పెంచాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు బండారి శోభ తెలిపారు.

విగ్రహం ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి: రెండు నెలల క్రితం బతుకమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈక్రమంలో మళ్లీ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అరూరి రమేష్ హామీ ఇచ్చారు. అయితే, ఇప్పటివరకు అతీగతి లేదని జయగిరివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. విగ్రహం ఏర్పాటు చేశాకే ఇంటింటికి వెళ్లి వంద ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని చేపడతామని తేల్చిచెప్పారు. భీమారంలోని డీవీఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగిన మండల సమీక్షా సమావేశం అనంతరం జయగిరివాసులు తమ గోడును ఎమ్మెల్యేకు వినిపించారు.

ప్రదీప్‌రావుకు భద్రత పునరుద్ధరణ

కాశిబుగ్గ: బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు గతంలో ఉన్న భద్రతను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే భద్రత తొలగించారని హైకోర్టులో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇటీవల పిటిషన్ వేశారు. తనకు ప్రాణహాని ఉందని, ఈక్రమంలో 2+2 భద్రత కల్పించాలని కోర్టును ఆయన కోరారు. బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు 2+2 భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

నేడు జెడ్పీలో గణతంత్ర వేడుకలు

వరంగల్ రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ సీఈఓ సాహితీ మిత్ర గురువారం ఉదయం 8.40 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని జెడ్పీ సూపరింటెండెంట్ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఓ వజ్రాయుధం



మామునూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



కేయూ క్యాంపస్: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అయిలయ్య



కరీమాబాద్: కేవీకేలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రాజన్న, తదితరులు

మామునూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఓ వజ్రాయుధం లాంటిదని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కును 18 ఏళ్లు దాటిన ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని రంగశాయిపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, ఏఎస్‌ఎం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి సూచించారు. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ, ఏఎస్‌ఎం మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వేర్వేరుగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మైదం రూపారాణి, వీరాంజనకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్య పరిరక్షణకు, నిష్పక్షపాత పరిపాలనకు ఓటు అనేది ఓ వజ్రాయుధం అని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య తెలిపారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ సత్యజాల, డాక్టర్ మౌనిక, డాక్టర్ మమత పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్: ఓటు హక్కును ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణజ్యోతి, డాక్టర్ శశాంక్, పశువైద్య కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో..

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పాలకుర్తి ప్రసాదరావు, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్, మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శులు చందర్‌రావు, బియాబాని పాల్గొన్నారు.

ముచ్చర్లలో..

హసన్‌పర్తి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రేణుక, కళ్యాణి, దివ్య, స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రవణ్, కర్ణాకర్, భిక్షపతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్

ఖిలా వరంగల్: సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, లేబర్ కమిషనర్ సునీత, వరంగల్ ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీ, ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ హామీ ఇచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం (బీఆర్‌ఎస్‌కేవీ) జిల్లా అధ్యక్షుడు బోగి సురేష్, మర్రి శ్రీనివాస్, దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు.అనంతరం ఈ–శ్రామ్ వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ బాబులాల్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు చింతాకుల సునిల్, ఇనుమల మల్లేశం, మెడిది మధుసూదన్, ఆడెపు భిక్షపతి, యాకూబ్, రమేష్, సంజీవ్, రాజు, శ్రీధర్ రెడ్డి, బాబు, సాంబయ్య, ఎండి.సుభాన్‌పాషా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండల అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో భీమారంలోని డీవీఆర్ గార్డెన్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. సమావేశంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, ఆత్మచైర్మన్ కందుకూరి చంద్రమోహన్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుభాష్ పాల్గొన్నారు.

విభజన హామీపై కేంద్రం నిర్లక్ష్యం వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: విభజన హామీపై కేంద్రం నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుల సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాషుమియా, నేదునూరి జ్యోతి, విశేశ్వర్‌రావు, పంజాల రమేష్, వినయ సారధి, రాజిరెడ్డి, భిక్షపతి, రాజ్‌కుమార్, మల్లికార్జున్, ఎల్లేష్, అజయ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

నేడు చింతల్‌లో బహిరంగ సభ

న్యూశాయంపేట: జమాతే ఇస్లామీ హింద్ ఖిలా వరంగల్ శాఖ ఆధ్వర్యంలో చింతల్ ఈద్గా మైదానంలో గురువారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు శాఖ అధ్యక్షుడు సయ్యద్ అజారుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

28న రథసప్తమి వేడుకలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుమతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు కృష్ణమూర్తి తెలిపారు. ఎర్రగట్టు గుట్ట ఆదిత్య కాన్సెప్ట్ స్కూల్‌లో 28న ఉదయం 9.30 గంటలకు విద్యార్థులతో హరిత యోగా శిబిరం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేత

హన్మకొండ అర్బన్: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం 108వాహనంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన అర్షం తిరుపతి కుటుంబానికి ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 108 ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులు రూ.5లక్షల బీమా చెక్కును కలెక్టరేట్‌లో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.సాంబశివరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

హన్మకొండ అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని హనుమకొండ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ -2023ను కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బాష బోయిన సంతోష్, ఉపాధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, తంగళ్లపల్లి రఘు, సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్ – మెసా క్యాలెండర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. కార్యకమంలో మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తౌఫిక్ – ఉల్ – రహమాన్, గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, అడ్వైజర్ హాసన్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కౌసర్ ఫారుఖీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సాంస్కృతిక పోటీలు

కాజీపేట రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ దరావత్ రఘు ఆధ్వర్యంలో పలు నాటికలు, పోటీలు నిర్వహించారు. వాటిలో వరకట్నం వద్దు అనే నాటిక సన్నివేశం అందరిని ఆలోచింపజేసి ఆకట్టుకుంది. దుర్గా భవాని, అనిల్, ప్రశాంత్, విజయకుమారి, జి.సుధాకర్‌రావు, ఎంకె.మూర్తి, వాత్సల్య, షర్మిల, బేబి కల్పత, పరిణీత నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, కమిటీ సభ్యులు జి.రాజేశ్వర్, ఎం.రాజయ్య, పి.ప్రశాంత్, ఎస్.ప్రవీణ్, పి.రవికిరణ్, బి.మాధవరావు పాల్గొన్నారు.

ఆక్టోపస్‌లో ట్రెడిషనల్ డ్రెస్ కాంపిటీషన్ పోటీలు

ఖిలా వరంగల్: శివనగర్‌లోని ఆక్టోపస్ ప్లేస్కూల్‌లో చిన్నారులకు ట్రెడిషనల్ డ్రెస్ కాంపిటీషన్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థి మునజ్జా.. అడ్వకేట్ వేషధారణలో ఆకట్టుకుందని ప్రిన్సిపాల్ దినేష్ తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టలబజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్నపనం, సాయంత్రం విశ్వక్సేనారాధన పున్యాహవాచనం, అంకురారోపణ, దేవత ఆహ్వానం, ధ్వజదివాసం జరిగింది. పూజా కార్యక్రమాల్లో అర్చకులు పరాశరం శేషాచార్యులు, శ్రీధరాచార్యులు, ఆలయ సిబ్బంది అవినాష్, రాజేందర్, రాధ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గందె గోవిందరాజులు, గుమ్ముడవెల్లి సత్యనారాయణ, ఆలయ సేవా సమితి సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, యాద నరసింహారావు, రేపాల సురేష్, వెంకటరమణ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. కాగా, గురువారం ధ్వజరోహణం కార్యక్రమం జరగనుంది.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులకు పత్యేక తరగతులు జరుగుతున్నాయి. దాంతో వారు రోజు సాయంత్రం 5–30 గంటల వరకు ఉండాల్సి వస్తోంది. ఈక్రమంలో 1995 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు నెల రోజుల పాటు అల్పాహారం (స్నాక్స్) అందజేసే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు, హ్యూమన్ రైట్స్ స్టేట్ యాక్టివ్ మెంబర్ సాగంటి మంజుల, నిమ్మల శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు సంధ్య, రజియా, అనంతలక్ష్మి, రమాదేవి, నాగమణి, శ్వేత హారతి, దేవిక, రజని పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాలలో విశ్వమంగళ దివస్



విశ్వమంగళ దివస్‌లో మాట్లాడుతున్న వైద్యులు

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో విశ్వమంగళ దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ గణేశ్వర్‌రెడ్డి, విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రేమానందరావు మాట్లాడుతూ శరీరానికి హాని కలిగించే చెడు ఆహార అలవాట్లు, వ్యసనాలను విడిచి పెట్టాలని సూచించారు. మంచి ఆరోగ్య అలవాట్లు, ఆయుర్వేదంలో చెప్పిన దినచర్యలు, రుతుచర్యలను ప్రజలకు వైద్యులు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, విశ్వ ఆయుర్వేద పరిషత్ సభ్యులు డాక్టర్ సమ్మిరెడ్డి, డాక్టర్ రాము, డాక్టర్ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇయర్ వైజ్ పరీక్షలు నిర్వహించాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో గతంలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో ఇయర్ వైజ్ స్కీం కింద చదివిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని ఏబీవీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పరీక్షల విభాగం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం డిగ్రీ కోర్సుల ఇయర్ వైజ్ స్కీం స్థానంలో సెమిస్టర్ సిస్టంను ప్రవేశపెట్టారని అన్నారు. ఈక్రమంలో ఇంకా కొంతమంది విద్యార్థులు పలు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, అశోక్, కల్యాణ్, సాయి, చంటి, శేఖర్, సాగర్, ప్రశాంత్, వినయ్, సురేష్, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

'ఆటో సంక్షేమ బోర్డు' ఏర్పాటు చేయాలి

వరంగల్ అర్బన్: ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు దొరకక బతుకుదెరువు కోసం ఆటోడ్రైవర్లుగా జీవనం కొనసాగుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఎదురుగా కొత్తగా ఆటో అడ్డాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఆటో, ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.మహబూబ్ పాషా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాగర్ సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు, నాయకులు జలీల్, ఆరీఫ్, బాయి, రైమత్‌ల్లా ఖాన్, సమ్మయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోతులను పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై 125కోతులను మున్సిపల్ సిబ్బంది బుధవారం పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు. కోతుల బెడదతో ట్యాంక్‌బండ్ తిలకించడానికి వచ్చే పర్యాటకులతో పాటు వాకర్స్ ఇటీవలి కాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో కమిషనర్ ప్రావీణ్యతో పాటు మేయర్ గుండు సుధారాణికి దృష్టికి సమస్య తీవ్రతను కార్పొరేటర్ ఎలకంటి రాములు తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ సిబ్బంది కోతులను బంధించి దూరప్రాంతాల్లో వదిలేశారు.

నిధులు విడుదల చేయండి

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈమేరకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించినట్లు విద్యార్థుల జేఏసీ చైర్మన్ మేకల అక్షయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1955వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ కళాశాల 65ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించారని, అభ్యసిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం భవనంశిథిలావస్థకు చేరుకుందని అన్నారు.

తాళ్ల పద్మావతిలో క్రీడోత్సవాలు

కరీమాబాద్: వరంగల్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడోత్సవాలు నిర్వహించారు. యాథిలైట్ ఆడ్రినా పేరుతో నిర్వహించిన వేడుకల్లో క్రికెట్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, 50, 100, 200, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు తాళ్ల మల్లేషం మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యానిలయంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలు ఏర్పరుచుకున్నట్లు తెలిపారు. అనంతరం, క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ వరుణ్, వైష్ణవి, ప్రిన్సిపాల్ స్వర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రవణ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ బేతి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమిడిలోని ఒలింపియాడ్ పాఠశాలలో..

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను డైరెక్టర్ తాళ్ల వంశీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించి విద్యార్థులకు అందించడంతో మైదానంలో తిప్పారు. కార్యక్రమంలో ఎరోబిక్స్, లెజిమ్స్ చేసి ప్రదర్శనలు ఇచ్చారు. 16 రకాల క్రీడాపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్ల చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేలు, హెచ్‌ఎం సతీష్, భాగ్యలక్ష్మి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో రిలయన్స్ నియామకాలు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్.రావు తెలిపారు. ప్రముఖ బహుళజాతి వ్యాపార సంస్థ రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ హెచ్‌ఆర్ శ్రీనవోహ్. ఎం.కె ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ నిర్వహించినట్లు పేర్కొన్నారు. నియామకాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ రాణాప్రతాప్ నియామక ప్రక్రియలపై విద్యార్థులకు వివరించారు.

డీసీసీబీ చైర్మన్‌కు పరామర్శ

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ బి.సామ్యా నాయక్, ఏడీ బక్క దానయ్య, తదితరులు పరామర్శించారు. కాలికి గాయంతో చికిత్స పొందుతున్న రవీందర్‌రావును ఐనవోలులోని ఆయన స్వగృహంలో బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

టీపీయూఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ జిల్లాశాఖ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు మహర్షి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని వీరస్వామి, బాధ్యులు రమేష్, పృథ్వీ పాల్గొన్నారు. కాగా, టీపీయూఎస్ బాధ్యులు మాట్లాడుతూ 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా జరపాలని విన్నవించారు.

గోపా మండల నూతన కార్యవర్గం

హసన్‌పర్తి: గోపా హసన్‌పర్తి మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోపా అధ్యక్షుడిగా జక్కురాజు, ప్రధాన కార్యదర్శిగా బలగాని రవీదర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, దూలం సురేష్, బత్తిని ప్రభాకర్, గట్టు యుగంధర్, జయగిరి రాజు, ఆర్గనైజర్‌గా రాకేష్, సహాయ కార్యదర్శులుగా కొయ్యడ శ్రీనివాస్, చంద్రమౌళి, మణికంఠ, కోశాధికారిగా కమలాకర్ గౌరవ అధ్యక్షుడిగా చిర్ర విజయ్‌లో పాటు పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు గోపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్ ప్రకటించారు.

మార్కెట్ చైర్ పర్సన్‌గా ఎస్సీ మహిళ!

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఈసారి ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సబార్డినేటర్ రూల్స్ ప్రకారం మార్కెట్ చైర్మన్, చైర్ పర్సన్లకు రొటేషన్ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేసింది.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ప్రాంతంలో మైదం కవిత (40) మృతదేహాన్ని గుర్తించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని, మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

14మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ లారీ అడ్డా వద్ద పేకాట ఆడుతున్న 14మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.31,770 నగదు, మొబైల్ ఫోన్లు, ఏడు మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

ట్యాంపరింగ్‌కు పాల్పడిన ఐదుగురిపై కేసు

కాజీపేట: కాజీపేట పట్టణంలో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న ఐదుగురు వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. నేతగాని యశ్వంత్ కుమార్, నల్ల విష్ణువర్ధన్ రెడ్డి, మిడిదొడ్డి రవితేజ, భూక్య అవినాష్, భూక్య రాజేందర్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ

కాకోజీ సెంటర్: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని ఖిలా వరంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలేంద్రకుమార్ అన్నారు. మామునూరు విమానాశ్రయంలో నాల్గవ తెలంగాణ వాయు విభాగం కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ సాజల్ కుద్దు ఆధ్వర్యంలో ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హన్సిక గౌడ్, ఎం.శివాని, మహేక్, లక్క సిద్దేశ్వర్, బైరబోయిన అజయ్‌లతోపాటు వివేకానంద హైస్కూల్, వరంగల్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు విమానం నడపడంలో శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శైలేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విమానం నడపడంలో శిక్షణ తీసుకోవడం ఎన్‌సీసీ విద్యార్థులకు గొప్ప అనుభూతి అని అన్నారు. కార్యక్రమంలో థర్డ్ ఆఫీసర్ చింతం నాగరాజు, కేర్ టేకర్లు శ్రీనివాస్, తిరుమల్, జూనియర్ వారెంట్ ఆఫీసర్లు భరద్వాజ్, జైసన్ తదితరులు పాల్గొన్నారు.